సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 6 । ఏప్రిల్ । 2023



భయ్యనపల్లిలో అగ్ని ప్రమాదం

గంగవరం మండలంలోని భయ్యనపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై రెండు కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి.

8లో



ఆసరాతో ఆర్థిక భరోసా

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు ఆర్థిక ఆసరా లభిస్తోందని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు.

8లో



ఇటుకల పండగ సందడి

గిరిజనుల ఆచార సంప్రదాయాలకు అద్దం పట్టే ఇటుకల పండగ సందడి మన్యంలో గ్రామగ్రామాన నెలకొంది.

రంజాన్ వేళలు

అరకు/పాడేరు:
ఇఫ్తార్ (గురు) 6-12 | సహర్ (శుక్ర) 4-32

రంపచోడవరం:
ఇఫ్తార్ (గురు) 6-27 | సహర్ (శుక్ర) 4-34

న్యూస్‌రీల్

జెన్‌కో ప్రాజెక్టులో గిరి యువతకు ఉద్యోగాలు

- ఉన్నతాధికారిని కోరిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు



విజయానంద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

సీలేరు: సీలేరు జెన్‌కో ప్రాజెక్టులో గిరిజన యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవి బాబు కోరారు. ఈ మేరకు ఎనర్జీ డిపార్ట్‌మెంట్ ముఖ్య కార్యదర్శి విజయానంద్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసినట్టు ఆయన తెలిపారు. జెన్‌కో ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న పోస్టులను గిరిజన యువకులతో భర్తీ చేయాలని సూచించినట్టు ఆయన తెలిపారు.

శిక్షణ, ఉపాధికి దరఖాస్తుల స్వీకరణ

పాడేరు రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో పాడేరు జీఎంఆర్ పాలిటెక్నిక్ స్కిల్ హబ్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో శిక్షణ, ఉపాధి కల్పనకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ ఆపైబడిన విద్యార్హత కలిగి 18 నుంచి 35 సంవత్సరాల వయసు గల వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి ఆధార్, బ్యాంకు అకౌంట్ మరియు విద్యార్హత ధ్రువపత్రాలు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో పాడేరు జీఎంఆర్ పాలిటెక్నిక్ స్కిల్ హబ్‌లో కోఆర్డినేటర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు 6302636174, 9493638405 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

నారాయణగిరిపై బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాల్లో భాగంగా పసుపు దంచుతున్న భక్తులు

రంపచోడవరం: రంపచోడవరం నారాయణ గిరిపై వేంచేసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారుజామున స్వామి వారికి ఉత్సవ ఆరంభ స్నాపనం నిర్వహించారు. అనంతరం సామూహిక శ్రీ విష్ణు సహస్రనామార్చన, శ్రీ విష్వక్సేన ఆరాధన పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సం గ్రహణం అంకురార్పణ, నివేదన, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. ఉత్సవాల్లో తొలిరోజు పసుపు దంచిన అనంతరం పెండ్లి రాట, స్వామి వారిని పెండ్లి కుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించారు. అన్నవరం దేవస్థానం బోర్డు డైరెక్టర్ కారుకోడి పూజ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

అనారోగ్యంతో శిశువు మృతి

హుకుంపేట: మండల కేంద్రం హుకుంపేటలో బి.నీలకంఠకు చెందిన మూడు నెలల కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. జ్వరం, జలుబు లక్షణాలతో బాధపడుతుండటంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తండ్రి నీలకంఠ తెలిపారు. మందులు వాడినా ఫలితం లేకపోయిందన్నారు. మంగళవారం రాత్రి నుంచి తీవ్రంగా ఏడుస్తూ బుధవారం మృతిచెందినట్టు ఆయన వివరించారు. మండలంలో అధికంగా శిశు మరణాలు సంభవిస్తున్నందున ఇందుకు గల కారణాలు వైద్యఆరోగ్యశాఖ అధికారులు తెలుసుకుని నివారణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వెలుగులు పంచకుండానే.. ఆరిపోయింది

- నిండా మునిగిన ట్వీలైట్ ఎల్‌ఈడీ యూనిట్
- రూ.కోటి కాంట్రాక్ట్ రద్దుతో దిక్కుతోచని స్థితి
- ఉపాధి కోల్పోయిన గిరి యువత
- గత ప్రభుత్వంలో నిర్వాకం



రంపచోడవరంలోని ట్వీలైట్ యూనిట్ భవనం

రంపచోడవరం: రంప గిరిజన మహిళా సమాఖ్య ఇండస్ట్రియల్ కోఆపరేటివ్ సొసైటీ (ట్వీలైట్) రంపచోడవరంలో నెలకొల్పిన ఎల్‌ఈడీ బల్బుల యూనిట్ వెలుగులు పంచకుండానే నిర్వహణ భారంతో మూతపడింది. గిరి యువత ఉపాధికి గండి పడింది.

● రంపచోడవరం కేంద్రంగా 2016 జూలైలో ఐటీడీఏ సహకారంతో ఆంధ్రాబ్యాంకులో రుణం తీసుకొని ఇక్కడ గిరి మహిళలు ఎల్‌ఈడీ బల్బుల యూనిట్ ఏర్పాటు చేశారు. ఈ పరిశ్రమకు అప్పట్లో జిల్లాస్థాయి అధికారుల సహకారం పుష్కలంగా లభించింది. అయితే ఎల్‌ఈడీ బల్బుల తయారీకి వచ్చిన రూ.కోటి విలువైన వర్క్ ఆర్డర్‌ను అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ హయాంలో రద్దు చేసి తమ ఉపాధికి తీరని గండి కొట్టారని అందులో పనిచేస్తున్న గిరిజన యువతులు ఆరోపిస్తున్నారు.

కనీసం చెప్పకుండానే..

గత టీడీపీ ప్రభుత్వంలో 2016–17లో ఏపీఈపీడీసీఎల్ ద్వారా రూ.2 కోట్ల విలువైన వర్క్ ఆర్డర్ ఇవ్వడంతో ఇందుకు సంబంధించి ముడిసరకు, ప్యాకింగ్ మెటీరియల్ కొనుగోలు చేశారు. ఏపీఈపీడీసీఎల్‌కు రూ.కోటి విలువైన ఎల్‌ఈడీ బల్బులను సరఫరా చేశారు. అయితే మిగిలిన రూ.కోటి ఆర్డర్‌ను ట్వీలైట్ సంస్థకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా రద్దు చేశారు. వర్క్ ఆర్డర్ తిరిగి ఇప్పించాలని కోరుతూ అప్పటి టీడీపీ ప్రభుత్వంలోని మంత్రులు, ఉన్నతాధికారులను కలిసినా ప్రయోజనం లేకపోయిందని సంస్థలో పనిచేస్తున్న గిరి యువతులు ఆరోపించారు.

రూ.40 లక్షల నష్టం

అడ్వాన్సుగా మెటీరియల్ కొనుగోలు చేయడంతో సుమారు రూ. 40 లక్షల మేర సంస్థ నష్టపోయింది. పంచాయతీరాజ్ కాంట్రాక్టర్‌కు రూ.80 లక్షల విలువైన ఎల్‌ఈడీ వీధి దీపాలను ట్వీలైట్ కంపెనీ సరఫరా చేసింది. కాంట్రాక్టర్ రూ. 40 లక్షలు మాత్రమే చెల్లించారు. సదరు కాంట్రాక్టర్‌కు అప్పటి అధికార పార్టీలోని పెద్దల ఆశీస్సులు పుష్కలంగా ఉండటంతో మిగిలిన రూ.40 లక్షలు చెల్లించలేదని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆ నగదు కోసం అప్పట్లో పలువురు మంత్రులను కలిసినా ప్రయోజనం లేకపోయిందని ట్వీలైట్ సంస్థ ప్రతినిధులు వాపోయారు.

కాంట్రాక్టర్‌పై కేసు :

కాంట్రాక్టర్ నగదు చెల్లించకపోవడంతో విజయవాడ ఇండస్ట్రీ కమిషనరేట్‌లో అతనిపై ఎంఎస్‌ఎంఈ (స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) డిలైడ్ పేమెంట్ యాక్టు కింద కేసు నమోదు చేశారు. ఏడాది గడుస్తున్నా ఎటువంటి ఫలితం లేదు. సెట్రాజ్ భవనంలో ట్వీలైట్ యూనిట్‌ను నిర్వహించడంతో విద్యుత్ బకాయిలు చెల్లించలేకపోయారు. యూనిట్ నిర్వహణకు ఆంధ్రా బ్యాంకు నుంచి రూ. 50 లక్షలు, ఐటీడీఏ ద్వారా అదే బ్యాంక్ నుంచి మరో రూ. 50 లక్షల రుణం పొందారు. ప్రస్తుతం వడ్డీతో కలిపి రూ.కోటికి పైగా బ్యాంక్‌కు చెల్లించాల్సి ఉంది.

కానరాని రికార్డులు..

రుణానికి సంబంధించి బ్యాంకు అధికారులు ట్వీలైట్ ప్రధాన నిర్వాహకులతో పాటు అందులో పనిచేసిన వారికి నోటీసులు జారీ చేశారు. అలాగే ఎల్‌ఈడీ యూనిట్ ఏర్పాటుకు వెలుగు కార్యాలయం నుంచి కొంత మొత్తం తీసుకున్నారు. ఇందుకు సంబంధించి వెలుగు కార్యాలయంలో ఎటువంటి రికార్డులు లేకపోవడం శోచనీయం. దీనిపై వెలుగు ఏపీడీ శ్రీనివాస్‌ను వివరణ కోరగా తమ కార్యాలయంలో ట్వీలైట్‌కు సంబంధించి ఎటువంటి రికార్డులు లేవన్నారు. రంపచోడవరం యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజకిషోర్ మాట్లాడుతూ ట్వీలైట్ యాజమాన్యానికి కోర్టు ద్వారా నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

గిరిజనులతో బలపడిన మైత్రి

- సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రాజేష్ పాండే
- సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో 200 దోమతెరల పంపిణీ



గిరిజనులకు దోమ తెరలు పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రాజేష్ పాండే

పెదబయలు: గిరిజనులతో పోలీసు మైత్రి బలపడిందని సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రాజేష్ పాండే అన్నారు. బుధవారం మండలంలోని అడుగుల పుట్టు పంచాయతీ సంపంగిపుట్టు, సీకరిపుట్టు,తారంగులు గ్రామాల్లో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. దీనిలో భాగంగా సీఆర్‌పీఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో 200 మంది దోమ తెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా సామాజిక సేవలో భాగంగా గిరిజనులకు సహకారం అందిస్తున్నామన్నారు. గతంలో మారుమూల గ్రామాలకు వెళ్లినప్పుడు గిరిజనులు దూరంగా ఉండేవారన్నారు. ఇప్పుడు పోలీసుసేవలను గుర్తించారన్నారు. వారి సమస్యలు పోలీసుల దృష్టికి తీసుకువచ్చి సేవలు పొందే దిశగా మార్పు వచ్చిందన్నారు. గిరిజన ప్రాంతంలో మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ప్రపంచంతో పోటీ పడేలా సాంకేతిక సేవలు సెల్ టవర్ల నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రజలు ప్రభుత్వ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో ఏ సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామాల్లో చదువుకుని ఖాళీగా ఉన్న గిరిజన యువత కోసం ప్రభుత్వం అనేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల కోసం శిక్షణ ఇస్తోందన్నారు. యువత చేడు అలవాట్లకు బానిస కాకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. సీఆర్‌పీఎఫ్ కమాండర్ పి.చరణ్‌రాజ్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా సేవలు




గిరిజనులకు దోమ తెరలు పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ యాదవ్


ముంచంగిపుట్టు: గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నామని సీఆర్‌పీఎఫ్ కమాండ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎన్ యాదవ్ అన్నారు. స్థానిక ఇ–198 బెటాలియన్ పోలీసులు సివిల్ యాక్షన్ ప్రోగ్రాంను బుధవారం మండలంలోని ఏనుగురాయి పంచాయతీ సెల్లుం గ్రామంలో నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ యాదవ్, ఎస్ఐ రవీంద్ర, సుజనకోట సర్పంచ్ రమేష్ చేతుల మీదుగా సెల్లుం, వనుగుపుట్టు, కొండపడ, జంగం సరియా, మజ్జిగూడ గ్రామాలకు చెందిన 200 మంది గిరిజనులకు దోమతెరలు పంపిణీ చేశారు. అనంతరం గిరిజనులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా యాదవ్ మాట్లాడుతూ గిరిజనులకు అన్ని వేళలా పోలీసుశాఖ అండగా ఉంటుందని ఆయన అన్నారు. సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జశ్వంత్ సింగ్, స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే లక్ష్యం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ



భారీగా హాజరైన మహిళలు



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: మహిళల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా సంబరాలు కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం కల్పించిందన్నారు. గత టీడీపీ పాలనలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి వారిని అప్పులు పాలు చేశారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా వారిని ఆదుకున్నారన్నారు. మండలంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకంలో 324 డ్వాక్రా స్వయంసహాయక సంఘాలకు చెందిన 2474 మంది అక్కచెల్లెమ్మలకు రూ.1,20,44,515 కోట్ల నిధులు వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. గిరిజన ప్రాంతంలో పోడు భూములకు పట్టాలు పంపిణీ చేసినట్టు చెప్పారు. ప్రతీ మహిళ ఆర్థికంగా నిలబడాలనే లక్ష్యంగానే పాలన సాగుతుందని అన్నారు. చిల్లర పార్టీల నేతల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. వైఎస్సార్ ఆసరా సంబరాలకు మండలంలోని గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలి వచ్చారు. థ్యాంక్యూ సీఎం సార్... జై జగనన్నా. 2024 ఎన్నికల్లో మళ్లీ సీఎం నువ్వే జగనన్న అంటూ మహిళలు నినాదాలు చేశారు.వెలుగు ఏరియా కోఆర్డినేటర్లు ఎల్. సత్యప్రసాద్, కృష్ణరావు, లీగల్ కోఆర్డినేటర్ దాసు, ఎంపీడీవో పూర్ణయ్య, తహసీల్దార్ భాస్కర రావు, వెలుగు ఏపీఎం ఈశ్వరబాబు నాయుడు, ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, వైస్ ఎంపీపీలు సోనే, రాజుబాబు,వైఎస్సార్ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాతారి సురేష్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు

కొయ్యూరు: సంక్షేమ పాలన అంటే ఎలా ఉండాలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని రాజేంద్రపాలెంలో నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి టీడీపీ కలవరపడుతోందన్నారు. తమ ప్రభుత్వాన్ని ఎదుర్కొనే సత్తాలేకనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. నాడు చంద్రబాబు ఏఒక్క హామీని నెరవేర్చలేకపోయారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలకు మించి సంక్షేమం, అభివృద్ధి చేపట్టారన్నారు. నాడు జన్మభూమి కమిటీలు ఇష్టానుసారంగా దోచుకున్నాయన్నారు. నేడు దళారుల ప్రభావం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతోందన్నారు. పాడేరు నియోజకవర్గానికి సంబంధించి 1510 సంఘాల ఖాతాల్లో రూ.6.11 కోట్లు జమ అయితే, ఒక్క కొయ్యూరు మండలంలోనే రూ.3.2కోట్లు లబ్ది చేకూరిందన్నారు. కోవిడ్ సమయంలో ఇచ్చిన హామీలను జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేయాల్సిన అవసరం ఉందన్నారు. చిట్టింపాడు సర్పంచ్ నేమాని నూకాలమ్మ ప్రసంగం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నాడు చంద్రబాబు మహిళలను ఎలా మోసం చేసింది ఆమె వివరించారు. జెడ్పీటీసీ వారా నూకరాజు, ఎంపీపీ బడుగు రమేష్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సీనియర్ నేత సత్యనారాయణ, పార్టీ మండలశాఖ అధ్యక్షులు జల్లి బాబులు, ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, ఉపాధ్యక్షులు అంబటి నూకాలు, అప్పన గజ్జయ్యదొర, ఎంపీటీసీలు బి.అప్పారావు, పి గంగా భవాని తదితరులు మాట్లాడారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, రాజేంద్రపాలెం సర్పంచ్ పి.సింహాచలం, పలువురు సర్పంచ్‌లు, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, తహసీల్దార్ తిరుమలరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కొయ్యూరు: ఈనెల ఏడు నుంచి 20 వరకు గ్రామాల్లో నిర్వహించనున్న జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కోరారు. బుధవారం ఆమె ఈ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొయ్యూరులో విలేకరులతో మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రతీ గడపకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటామన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నేతలు విధిగా తిరగాలని సూచించారు. జగనన్నే మా భవిష్యత్తు, మానమ్మకం నువ్వే జగనన్న, గడప గడపకు కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. బోయ వాల్మీకుల సమస్యను ఇటీవల సీఎంను కలిసి వివరించామన్నారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాల్లో చేర్చడంపై చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడు తీర్మానం చేసి కేంద్రానికి పంపారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్ : ఏకలవ్య పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని పాడేరు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ తెలిపారు. 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు.ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు జిల్లాలోని ఏదైన గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2022–23 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలని సూచించారు. విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 4 ప్రకారం ఇంటి వద్ద ఉంటూ ఐదో తరగతి చదివిన విద్యార్థులు కూడా అర్హులన్నారు. దీనిపై విద్యార్థి యొక్క తల్లితండ్రులు/సంరక్షకుల డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆరో తరగతి ప్రవేశాలకు 10 నుంచి 13 ఏళ్లలోపు, ఏడో తగరతి విద్యార్థులకు 11 నుంచి 14 ఏళ్లలోపు, ఎనిమిదో తరగతి విద్యార్థులకు 12 నుంచి 15 ఏళ్లలోపు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు 13 నుంచి 16 ఏళ్ల లోపు వయసు కలిగిన విద్యార్థులు అర్హులన్నారు.

ఆశ్రమ విద్యార్థినులకు తీవ్ర అస్వస్థత

- 18 మందికి జ్వరం, వాంతులు, విరేచనాలు
- ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలింపు


8లో



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

పార్టీ కోసం కొత్తవారు రావాల్సిందే..!

- చేరికలపై చంద్రబాబు వ్యాఖ్యలు
- ఇప్పుడున్నవారి బలం చాలదన్నట్లుగా ఉపన్యాసం
- అయ్యన్నకు దగ్గరగా.. గంటాకు దూరంగా...!



ముఖ్యులు, అయ్యన్నని పిలిచి ఫొటో తీసుకుంటున్న చంద్రబాబు, మరోవైపు కూర్చున్న గంటా

సాక్షి, విశాఖపట్నం : పార్టీ బలోపేతం కావాలంటే కొత్తవారు రావాల్సిందేనని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వ్యాఖ్యలు చేయడంపై కార్యకర్తలు, నాయకుల్ని విస్మయానికి గురిచేసింది. పరోక్షంగా పార్టీ బలహీనంగా ఉందన్న విషయం అధినేత అంగీకరించడం చర్చనీయాంశమైంది. మరోవైపు అయ్యన్న, గంటా మధ్య ఉన్న విభేదాలు వేదికపై కనిపించాయి. అయ్యన్నని దగ్గరకు తీసుకున్న చంద్రబాబు.. గంటాని దూరం పెట్టడంపై ఆయన వర్గీయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పీఎం పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్‌లో బుధవారం జరిగిన ఉత్తరాంధ్ర జోనల్ సమావేశానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హాజరయ్యారు. ఊకదంపుడు ఉపన్యాసాలు, టెక్నాలజీ డైలాగులు మళ్లీ చెప్పడంతో కార్యకర్తలు డీలాపడిపోయారు. అధికారంలోకి వచ్చాక జగన్ ఒక్క ఇల్లు కట్టలేదు.. అవునా.. కాదా అని చంద్రబాబు అడిగితే ఒక్కరు కూడా అవునని చెప్పలేదు. అదేవిధంగా వైజాగ్‌ని దోచుకున్నారు.. అవునా.. కాదా అని అడిగినా.. కార్యకర్తల నుంచి సమాధానం రాకపోవడంతో అసహనం వ్యక్తం చేసిన చంద్రబాబు.. మీకు కూడా జగన్ అంటే భయం.. అందుకే అవునని చెప్పడం లేదని కవర్ చేసుకున్నారు. ఇక పార్టీని బలోపేతం కావాలంటే బయటవాళ్లు రావాలన్న బాబు వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. అంటే ఇప్పుడు పార్టీ ఉత్తరాంధ్రలో బలహీనంగా ఉందనా అనే అనుమానాలు కార్యకర్తల్లోనూ, ఇటు నాయకుల్లోనూ కలిగింది. తమ నాయకత్వంపై అధినేతకు నమ్మకం లేదన్న మీమాంసలో పడిపోయారు. మరోవైపు సాధికార సారథులు, ఓటర్ల మ్యాపింగ్‌లో పూర్ పెర్ఫార్మెన్స్ కనబరిచిన నియోజకవర్గాల ఇన్‌చార్జులు, మండల అధ్యక్షులు, నాయకులు సిగ్గు తెచ్చుకోవాలంటూ అందరి ముందరే విమర్శించడంపైనా మండిపడుతున్నారు.

అయ్యన్నను పిలిచారు.. గంటాని దూరం పెట్టారు..

పార్టీలో వర్గవిబేధాలపైనా చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలో నేతలు అందరినీ కలిపేసుకుని పోవాలనీ.. కొందరు విబేధాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని చంద్రబాబు అన్నారు. పార్టీలో గ్రూపులు పెట్టిన వారికి, విబేధాలు సృష్టించిన వారికి కాకుండా... త్యాగాలు చేసినవారికి మాత్రమే పదవులు వస్తాయని స్పష్టం చేశారు. గంటా, అయ్యన్న, వంగలపూడి అనితని ఉద్దేశించి చంద్రబాబు వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమైంది. అంతకు ముందు చంద్రబాబు రాకముందు కూడా వీరి మధ్య విబేధాలు బయటపడ్డాయి. సభకు ఆలస్యంగా వచ్చిన అయ్యన్న, అనితను వేదికపై ముందు వరుసలో కూర్చోవాలని నాయకులు చెప్పినా.. గంటా ముందు వరుసలో ఉన్నారని చివర్లో కూర్చున్నారు. చంద్రబాబు వచ్చినప్పుడు గంటా విమానాశ్రయానికి వెళ్లారనీ.. అయితే.. ఎయిర్‌పోర్టుకు ఎవరూ రావొద్దని చంద్రబాబు చెప్పడంతో గంటా తిరిగి వెనక్కు వచ్చేశారని సమాచారం. అదేవిధంగా బాబు వచ్చిన తర్వాత..అయ్యన్నని దగ్గరకు పిలిచారు. కానీ.. వక్కన ఉన్న గంటాని పట్టించుకోలేదు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



ఐటీడీఏలో నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్

నివాళులర్పించిన కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు రూరల్ : భారతదేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని బుధవారం పాడేరులో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అభిషేక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం , వారి అభ్యున్నతికి అలుపెరుగని పోరాటం చేసిన జగ్జీవన్‌రామ్ సేవలు ఎన్నటికి మరువలేనివన్నారు. సబ్ కలెక్టర్ వి. అభిషేక్ మాట్లాడుతూ ఏ పని అయినా దానిమీద గౌరవంతో దృష్టి పెట్టి పనిచేస్తే అది మన గౌరవాన్ని పెంచుతుందని జగ్జీవన్‌రామ్ అనేవారని, అవి స్ఫూర్తినిచ్చే మాటలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఎల్‌డీఎం రవితేజ, పౌర సరఫరాల శాఖ డీఎం గణేష్, ఐటీడీఏ ఏపీవో వీఎస్ ప్రభాకర్‌రావు, డీఎస్‌వో అప్పారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అలమేలు మంగకు విశేష అభిషేకం



అలమేలు మంగమ్మకు అభిషేకం చేస్తున్న అర్చకులు

సింహాచలం : చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం సుజాతనగర్‌లోని అలమేలు మంగమ్మ ఆలయంలో అమ్మవారికి విశేషంగా పంచామృతాభిషేకాలు నిర్వహించి నక్షత్ర హారతులు అందజేశారు. లక్ష్మీ సహస్రం, విష్ణు సహస్రనామ పారాయణాన్ని విశేషంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి చందనంతో అలంకారం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వీఆర్ పురం ఎస్‌ఐకు తీవ్ర గాయాలు

వేలేరుపాడు (ఏలూరు జిల్లా): విధులకు హాజరయ్యేందుకు వెళుతూ బైక్ అదుపుతప్పడంతో అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా వీఆర్‌పురం ఎస్‌ఐ తెల్లం దుర్గాప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. తన స్వగ్రామమైన ఏలూరు జిల్లా చింతలపూడి నుంచి వేలేరుపాడు మండలం రుద్రమకోట గోదావరి రేవుకు ఎస్సై దుర్గాప్రసాద్ బుధవారం సాయంత్రం బైక్‌పై బయలుదేరారు. వేలేరుపాడు మండలం మద్దిగట్ల – రుద్రమకోట రోడ్డులో లచ్చిగూడెం కల్వర్టు వద్ద గొయ్యిలో పడి బైక్ అదుపుతప్పి కిందపడగా, కాలు, చేతులకు తీవ్రగాయాయ్యాయి. స్థానికులు అతనిని చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నిరాశ్రయులకు కేజీహెచ్‌లో ప్రత్యేక వార్డు



సేవా వార్డును ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

మహారాణిపేట: నిరాశ్రయులకు కేజీహెచ్‌లో ప్రత్యేకంగా సేవా వార్డును ఏర్పాటు చేశారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బుధవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్ ఈ వార్డును ప్రారంభించారు. ఎవరూ లేని వారి కోసం పాత బ్లడ్ బ్యాంక్‌కు ఎదురుగా 10 పడకలతో ఈ వార్డును ఏర్పాటు చేశారు. వీరికి ఉత్తమ సంరక్షణ, చికిత్స అందిస్తామని డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఆర్‌ఎంవో కె.జగదీష్ కుమార్ ఏఆర్‌ఎంవో ఎ.విజయలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్లు రమణమ్మ, కల్పనా మౌళి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ పి.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఆసరాతో ఆర్థిక భరోసా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ప్రజాప్రతినిధులు, నేతలు



వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమానికి హాజరైన గ్రామస్తులు

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- చింతూరులో వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ

చింతూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని మహిళకు ఆర్థిక చేయూత లభిస్తోందని, తద్వారా అక్కా, చెల్లెమ్మల్లో ఆనందం వెల్లివిరుస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. చింతూరులో స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం మూడవ విడత మంజూరు చేసిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రవేశ పెట్టిన పథకాలతో మహిళలు తమ స్వశక్తితో ఆర్థికంగా బలోపేతం అవుతున్నారన్నారు. తొలి రెండేళ్లలో రాష్ట్రంలో కరోనాతో ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలు ఆగకుండా పాలించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదని, వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మహిళా సాధికారతే ధ్యేయంగా స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళలకు ఆర్థిక పురోగతి కోసం ఆసరా పథకం అందిస్తోందన్నారు. చింతూరు మండలంలోని 460 స్వయం సహాయక సంఘాలకు చెందిన 4,312 సభ్యులకు రూ.1.72 కోట్లు మంజూరైనట్టు చెప్పారు.అనంతరం ఎమ్మెల్యే స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎస్టీ కమీషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీలు మేడేపల్లి సుధాకర్, యడమ అర్జున్, సొసైటీ ఛైర్మన్ శ్యామల విజయ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కారం

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో గిరిజనులకు సంబంధించిన ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న కొంపపోడు పట్టాలను తమ ప్రభుత్వ హయాంలో అందించడం జరిగిందన్నారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎన్నో ప్రజా సమస్యలు పరిష్కారం కావడంతో ప్రజల్లో పార్టీకి ఎనలేని ఆదరణ పెరిగిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో వలంటీరు, సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటికే పథకాలు చేరుతుండడంతో పేదలు ఎంతో సంతోషిస్తున్నారని ఆమె తెలిపారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ద్వారా పేదల సమస్యలు నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లి పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే తెలిపారు.

భయ్యనపల్లిలో అగ్ని ప్రమాదం

- రెండు కుటుంబాలు నిరాశ్రయం
- రూ.ఐదు లక్షల మేర ఆస్తి నష్టం

గంగవరం : మండలంలోని భయ్యనపల్లి గిరిజన గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో తాటాకుల ఇల్లు దగ్ధమై రెండు నిరుపేద కుటుంబాలు కట్టు బట్టలతో నిరాశ్రయులుగా మిగిలాయి. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన కోమటి సూర్యం, కోమటి ప్రసన్నల కుటుంబాలు సర్వం కోల్పోయి, కట్టు బట్టలతో వీధిన పడ్డారు. రాత్రి 11 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందడంతో ఈ ప్రమాదాన్ని అదుపు చేయలేకపోయామని గ్రామస్తులు తెలిపారు.

ప్రమాద సమాచారంతో సర్పంచ్ బూరుకట్ల పార్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరావు, బలుమూరి సత్యనారాయణ(దొర), సంజీవరావు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. బుధవారం ఉదయం రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ శ్రీమన్నారాయణ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫయాజ్‌భాషా(జిలానీ), వీఆర్వో రాజేశ్వరి అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించారు. ఆర్ఐ జిలానీ మాట్లాడుతూ ఈ ప్రమాదం వల్ల సుమారుగా రూ.ఐదు లక్షల మేర ఆస్తి నష్టం అయిందన్నారు. బాధితులకు తక్షణ సాయం అందిస్తామని ఆర్ఐ తెలిపారు. రేషన్, ఆధార్, బ్యాంక్ పాసు పుస్తకాలు వంటివి మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఇనుప బీరువాలు, వంటసామాగ్రి, మూడు కాటాల జీడిమామిడి పిక్కలు, నాలుగు బస్తాలు బియ్యం, రూ.లక్ష నగదు, విలువైన బంగారు ఆభరణాలు, రేషన్, ఆధార్, విలువైన పత్రాలు దగ్ధం కావడంతో సర్వం కోల్పోయామని బాధితులు రోధించారు. బాధిత కుటుంబాలకు రెవెన్యూ శాఖ పరంగా తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం, వంట నూనె, కందిపప్పు సరుకులను సర్పంచ్ బూరుకట్ల పార్వతి, వార్డు సభ్యులు రేగం బేబీ, ఆర్ఐ జిలానీ, పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరావు, బలుమూరి సత్యనారాయణ, సంజీవిరావు, బుర్రే శ్రీను, లక్షణరావు, అచ్చియ్య బాధితులను పరామర్శించారు. అగ్ని ప్రమాద విషయాన్ని ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి దృష్టికి ఫోనులో వారు వివరించగా బాధిత కుటుంబాలకు సాయం అందిస్తామని వారు హామీ ఇచ్చారు.

భయ్యనపల్లి అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని స్థానిక ఎస్ఐ సిహెచ్.చినబాబు పరామర్శించి 50కేజీల బియ్యం, కాయగూరలు పోలీసు శాఖ తరపున అందచేశారు.



అగ్ని బాధిత కుటుంబాలకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పార్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆలివ్ రిడ్లే సంతతిని కాపాడుకోవాలి



ఆలీవ్ రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెడుతున్న జేసీ కల్పనా కుమారి

పరవాడ: ఆలీవ్‌రిడ్లేతాబేళ్ల సంతతిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పిలుపునిచ్చారు. సింహాద్రి ఎన్టీపీసీ ఆర్థిక సహకారంతో ముత్యాలమ్మపాలెం తీరం హేచరీలో అభివృద్ధి చేసిన 500 ఆలీవ్‌రిడ్లే తాబేళ్లను జేసీ బుధవారం సముద్ర జలాల్లోకి వదిలారు. ఈ తాబేలు పిల్లల పెంపకానికి నిధులు కేటాయిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యా న్ని జేసీ అభినందించారు. తీరంలో తాబేళ్లు పెట్టిన గుడ్లను సేకరించి అక్కడే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హేచరీలో పిల్లలను పొదిగించి అనంతరం సముద్ర జలాల్లో విడిచిపెట్టడానికి అవసమైన వ్యయాన్ని ఎన్టీపీసీ భరిస్తుందని ఫారెస్టు సెక్షన్ అధికారి ఎ.వి.ఎస్.కె.వర్మ చెప్పా రు. అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది ఈ.శివ తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై అప్పన్న తిరువీధి

సింహాచలం : సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదవరోజు బుధవారం స్వామివారికి సూర్యప్రభ వాహనంపై తిరువీధి విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవిలను విశేషంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై అధిష్ఠింపజేశారు. సాయంత్రం సింహగిరి మాడ వీధిల్లో ఘనంగా తిరువీధి నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు గిరి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి మృగయోత్సవం (దొంగలదోపు) నిర్వహించనున్నారు.



సూర్యప్రభ వావానంపై అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా ధర్మపీఠం పండగ



పెద్దరాయి(ధర్మపీఠం)కి పూజలు చేస్తున్న మహిళలు



పసుపునీరున్న బిందెలతో చెట్టు వద్ద ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

రావికమతం : చినపాచిల గ్రామంలో న్యాయదేవతగా పేరొందిన ధర్మపీఠం(పెద్దరాయి) పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచీ బిందెలతో పసుపు నీళ్లు తెచ్చి పెద్దరాయికి, వేపచెట్టుకు అభిషేకం చేశారు. యువకులు, పిల్లలు, మహిళలు రంగులు పూసుకుని కేరింతలు కొట్టారు. దేముడి గుడిలోనైనా అబద్ధం చెబుతారేమో కానీ చినపాచిల పెద్దరాయిపై నిలబడి ఎవ్వరూ అబద్ధం చెప్పేందుకు సాహసించరు. ఎన్నో తగవులను తీర్చిన ఈ ధర్మపీఠాన్ని గ్రామస్తులు దేవతగా కొలుస్తుంటారు. ఏటా పండగ జరిపి, పూజలు చేస్తుంటారు.

ధర్మపీఠం చరిత్ర

గ్రామంలోని ఓ కొండపై పూర్వం రుషులు ఈ రాళ్లపైనే కూర్చుని తపస్సు చేసేవారట. వారు గతించిన తర్వాత ఆ రాళ్లకు మహిమలున్నాయని భావించిన ఆ గ్రామ పూర్వీకులు ఆ రాళ్లను అతి కష్టం మీద గ్రామానికి తెచ్చి, వేప చెట్టు వద్ద ప్రతిష్ఠ చేశారు. వాటిని భక్తి శ్రద్ధలతో పూజిస్తున్నారు. గ్రామంలో ఎవరైనా గొడవలు పడితే ఆ రాయి వద్దకు రప్పించి, తగవులు తీర్చేవారట. ఆ ఆనవాయితీ ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ఆ రాయిపై నిలబడి ఎవ్వరైనా నిజం చెప్పాల్సిందే. లేకుంటే ఎన్నో కష్టాల పాలవుతారని నమ్మకం. అబద్ధాలాడినవారు తీవ్రంగా నష్టపోయిన దృష్టాంతాలు గ్రామస్తులెవరిని అడిగినా చెప్తారు. ఈ విషయం అందరికీ తెలిసి, ఎక్కడెక్కడి నుంచో కూడా తగవులు తీర్చుకునేందుకు ఈ గ్రామానికి వస్తుంటారు. అంతటి మహిమ గల ఆ పెద్దరాయి పండగను గ్రామస్తులు ఏటా మాదిరే ఈసారి కూడా ఘనంగా నిర్వహించారు.

ఆశ్రమ విద్యార్థినులకు తీవ్ర అస్వస్థత



అస్వస్థతతో సీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్న విద్యార్థినులు



విద్యార్థినులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారి మౌనిక

ముంచంగిపుట్టు : మండలంలోని జోలాపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల (జీటీడబ్ల్యూఏ)లో 18 మంది విద్యార్థినులు బుధవారం సాయంత్రం జ్వరాలు, వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఉపాధ్యాయులు, వార్డెన్ కామేశ్వరరావు హుటాహుటిన ప్రైవేట్ వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యాధికారిణి మౌనిక వారికి వెంటనే వైద్య సేవలు అందించారు. తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థినుల్లో 12 మందికి సెలైన్ ఎక్కించారు. వారిని తమ పర్యవేక్షణలో ఉంచినట్టు వైద్యాధికారిణి తెలిపారు. ఇలా ఉండగా గత రెండు రోజులుగా జోలాపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థినులు జ్వరాలు, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారని అదే ఆశ్రమానికి చెందిన విద్యార్థినులు తెలిపారు. పాఠశాలలో తాగునీటి ట్యాంక్‌లో నీరు కలుషితం కావడం వల్లే వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు కారణమని చికిత్స పొందుతున్న విద్యార్థినులు తెలిపారు.

భజన పోటీల విజేత పార్వతీపురం

మాడుగుల రూరల్ : కె.జె.పురంలో బాలాంజనేయ స్వామి తీర్థం సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 20 భజన బృందాలు పాల్గొన్నాయి. పోటీల్లో ప్రథమ బహుమతి పార్వతీపురం భజన బృందం జట్టుకు లభించింది. ద్వితీయ బహుమ తి కొత్తపాలెం భజన బృందానికి, తృతీయ బహుమతి వరాహపురం భజన బృందానికి లభించాయి. వీరికి వరుసగా రూ.12,116, రూ.8,116, రూ.6,116 చొప్పున్న నగదును అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పి.రావు, వెంకటరమణ మూర్తి వ్యవహరించారు.

వందేభారత్ నేడు రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ (20833) వెళ్లాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను గురువారం రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ నుంచి విశాఖ వస్తున్న వందేభారత్ రైలుపై ఖమ్మం – విజయవాడ మధ్యలో దుండగులు జరిపిన రాళ్ల దాడిలో సీ 8 కోచ్ అద్దాలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. కోచ్‌కు సంబంధించిన అద్దాన్ని విశాఖపట్నం చేరిన తరువాత మార్పు చేశారు. ఈ కారణంగా గురువారం ఉదయం 5.45 గంటలకు బయల్దేరాల్సిన వందేభారత్ 4 గంటలు ఆలస్యంగా 9.45 గంటలకు బయల్దేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

లాభాల బిందు సేద్యం

వ్యవసాయ విప్లవానికి ప్రభుత్వం తెరతీసింది. అన్నదాతకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. ఈ క్రమంలోనే సేద్యం సులభతరం చేసేందుకు బిందు పరికరాలను సమకూరుస్తోంది. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు రైతులను ప్రోత్సహిస్తోంది. డ్రిప్ పరికరాలను రాయితీపై పంపిణీ చేస్తోంది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు 90శాతం వరకూ సబ్సిడీ ఇస్తోంది. దీంతో జిల్లాలో సూక్ష్మ సేద్యం లక్ష్యాన్ని దాటిపోయింది. గతంలో ఉద్యాన పంటలకు మాత్రమే పరిమితమైన రాయితీ ప్రస్తుతం అన్ని రకాల పంటలకు ప్రభుత్వం వర్తింప చేస్తోంది.

- సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం
- ఇప్పటి వరకు రూ.2.65 కోట్ల రాయితీ
- జిల్లాలో డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు ఇచ్చిన లక్ష్యం 600 హెక్టార్లు
- ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్లు జరిగినవి 1721 హెక్టార్లు
- పరిపాలనా పరమైన అనుమతి పొందినవి 832 హెక్టార్లు
- పరికరాలను అందించిన పొలాలు 572 హెక్టార్లు



డ్రిప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనకాపల్లి రూరల్ : ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టేలా ప్రభుత్వం బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం సన్న, చిన్నకారు రైతులకు రాయితీలు అందిస్తోంది. ఆసక్తిగల రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను రిజిస్ట్రేషన్లు చేయించుకునే వెసులబాటును కల్పించింది. ప్రస్తుతం ఈ ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటికే లక్ష్యాన్ని మించి రిజిస్ట్రేషన్లు రావడంతో ఈ మేరకు జిల్లాలో సూక్ష్మ వ్యవసాయానికి అధికారులు తమ వంతు కృషి చేస్తున్నారు. డ్రిప్ ,స్ప్రింక్లర్ల ఏర్పాటుతో నీటి వృథాను అరికట్టడంతో పాటు విద్యుత్‌ను కూడా పొదుపు చేయవచ్చు. మొక్కకు సరిపడా నీరంది పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. ఈ విధానం రైతులకు లాభదాయకంగా ఉంటోంది.

లక్ష్యాన్ని మించి రిజిస్ట్రేషన్లు

డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి జిల్లాలో 600 హెక్టార్లకు మంజూరు చేయాలనేది ఏపీఎంఐపీ లక్ష్యం . ఈ ఏడాది మార్చి 31 నాటికి 1721 హెక్టార్లకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటిలో 877 మంది రైతుల దరఖాస్తులకు పరిపాలనా ఆమోదం లభించింది. వీటి ద్వారా 832 హెక్టార్లకు రాయితీపై సూక్ష్మ సేద్యం పరికరాలను ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకూ 572 హెక్టార్లకు బిందు, స్ప్రింక్లర్ల యూనిట్లను రైతులకు అందజేశారు. మిగిలిన రైతులకు మరో 10 రోజుల్లోగా పరికరాలను అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



సూక్ష్మ సేద్యం అమలు తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

రాయితీ రూ.2.65 కోట్లు

బిందు, తుంపర సేద్యం పరికరాల కోసం దరఖాస్తు చేసుకునే రైతులకు భూమి విస్తీర్ణం మేరకు రాయితీ లభిస్తుంది. జిల్లాలో ఇప్పటి వరకు రూ.2,65,90,000 రాయితీ ఇచ్చారు. 5 ఎకరాల్లోపు రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో సూక్ష్మ సేద్యం సదుపాయాన్ని కల్పిస్తోంది. 5 నుంచి 10 ఎకరాల్లోపు రైతులకు 70శాతం సబ్సిడీ ఇస్తోంది. సబ్సిడీ పోగా మిగిలిన సొమ్ము రైతులు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో డ్రిప్‌ఏర్పాటు చేసుకుని ఏడేళ్లు ముగిసిన రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను పంపిణీ చేసే 5 కంపెనీల్లో రైతులు దేన్నయినా ఎంపిక చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

క్షేత్రస్థాయిలో పరిశీలన

డ్రిప్,స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎంత భూమి ఉంది, బోరు సదుపాయం ఉందా ? ఉంటే అందులో ఎంత నీరు వస్తోంది. రైతు పొలంలో ఎన్ని చెట్లు ఉన్నాయి ?పైపుల ఏర్పాటుకు ఎంత ఖర్చవుతుంది ?ఇందులో రైతుకు ఎంత సబ్సిడీ వర్తిస్తుందనే విషయాలను రైతు భరోసా కేంద్రాల ఉద్యాన, వ్యవసాయశాఖల అసిస్టెంట్లు , కంపెనీ ప్రతినిధులు వెళ్లి, క్షేత్ర స్థాయిలోపరిశీలించి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకూ 877 మంది రైతులకు సంబంధించిన 832 హెక్టార్లకు పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఇందులో 572 ఎకరాలకు డ్రింప్, స్ప్రింక్లర్ల పరికరాలను అందజేశారు.

అర్హులందరికీ పరికరాలు



డ్రిప్,స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి లక్ష్యానికి మించి అదనంగా యూనిట్లు అందించడానికి కృషి చేస్తున్నాం. రైతులు తమ పరిధిలో రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి. ఆర్‌బీకే ఇన్‌చార్జిలు కంపెనీప్రతినిధుల ద్వారా ప్రాథమిక సర్వే చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్లు చేయించుకున్న అర్హులైన ప్రతి రైతుకు డ్రిప్, స్ప్రింక్లర్లను మంజూరు చేస్తాం. ఉద్యాన, వ్యవసాయశాఖ అసిస్టెంట్ల ద్వారా పరికరాలను అందజేస్తాం. ఆర్‌బీకే ద్వారా రైతులు తమకు ఏ కంపెనీ డ్రిప్ పరికరా లను కావాలో ఎంచుకోవచ్చు. వారు ఎంపిక చేసుకున్న కంపెనీతోయూనిట్లు ఇన్‌స్టాల్‌చేయిస్తున్నాం.

– జి.వి.లక్ష్మి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారిణి, అనకాపల్లి